క్లుప్తంగా

సీఎం జగన్‌కు అండగా దళితులు



భీమవరపుకోటలో దళితులతో మాట్లాడుతున్న ఆరుగుల మోషే

కోటనందూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళితులంతా అండగా ఉన్నారని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే అన్నారు. మండలంలోని భీమవరపుకోట, కేఈ చిన్నయ్యపాలెం, పాత కొట్టాం, కొత్తకొట్టాం, అల్లిపూడి, ఎస్సార్‌పేట, కోటనందూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. దళితులతో సమావేశమై దళితులకు మంచి చేసిన సీఎం జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదల బ్రతుకులు బాగుండాలన్నా జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13 జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏలేరులో స్వల్పంగా తగ్గిన నీటినిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు జలశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గాయి. వేసవి కావడంతో ఎగువ ప్రాంతం నుంచి నీటిసరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం పంట సాగు లేకపోవడంతో దిగువ ఆయకట్టుకు నీటి విడుదల నిలిపివేశారు. శనివారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు గాను 69.03 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.86 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఎండలను దృష్టిని పెట్టుకొని అధికారులు నీటి సరాఫరా చేస్తున్నారు. విశాఖకు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి సరాఫరా నిలిపివేశారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. రెండో శనివారం, సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు సత్యదేవుని దర్శనానికి తరలివచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. అన్నివిభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా జరిగింది. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు. వేదపండితులు యనమంద్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, అర్చకుడు శర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- జగ్గంపేటలో ఎన్నికల ప్రచారం



జగ్గంపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం



గోకవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

జగ్గంపేట: రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పిలుపునిచ్చారు. జగ్గంపేటలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు మద్దతుగా పార్టీ నాయకులు, అభిమానులు గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ ఐదేళ్ల పాటు పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సీఎం జగన్ పాలన చూసి బెంబేలెత్తుతున్న కూటమి నేతలు బూటకపు హామీలతో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మవద్దన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా జగ్గంపేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేసి జగ్గంపేటను జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను కాకినాడ ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ జీను మహేష్, జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, రామకుర్తి జగాల్, కురుటూరి వీర్రాజు, కోండ్రోతు పైడియ్య, రెడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి

గోకవరం: ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమారుడు తోట రాంజీ అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, తీన్‌మార్ నడుమ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా ప్రధాన రహదారిపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకూ లబ్ది చేకూరిందన్నారు. ఈ పథకాలు కొనసాగాలన్నా, సంక్షేమ పాలన అందాలన్నా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. దీనికి ప్రతిఒక్కరూ సహకరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సమ్మెటి నాని, కర్రి సూరారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు తుమ్మల చిన్నబ్బు, సుంకర వెంకటరమణ, అక్షింతల రాజా, నరాలశెట్టి నర్సయ్య, వీర్ల వెంకటేశ్వర రావు, తోలేటి రాంప్రసాద్, షేక్ మదీనా, తుమ్మల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గెలుపు చారిత్రక అవసరం

వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న రఘురాం

జగ్గంపేట: పేదలు ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతికేలా చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన చేశారన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. మెడికల్ కళాశాలలు, పోర్టులు, విద్య, వైద్య రంగాల్లో చేసిన సంస్కరణలను తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో సీఎం జగన్ పోటీ చేసినట్లుగా ప్రతిఒక్కరూ భావించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజు, పార్టీ నాయకులు రెడ్డి భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



రామకృష్ణాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



వెంకటనగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు


ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటనగరం, శాంతిఆశ్రమం, తోటపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి రోజు రోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. జగన్ పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం, ఎం.కొత్తూరు, దిగువ ధారపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సుపరిపాలన అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, సర్పంచ్ వంతు రామలక్ష్మి, పార్టీ నేతలు గంటిమళ్ల శ్రీను, రాజు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్, లవుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రధనుస్సు

ప్రత్తిపాడు: ఆకాశంలో శనివారం సాయంత్రం సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు సాయంత్రం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. వాతావరణం చల్లబడింది. ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు ప్రజలకు కనువిందు చేసింది.



ప్రత్తిపాడులో అలరించిన ఇంద్రధనుస్సు

పేదల పక్షపాతి జగన్‌ను మళ్లీ గెలిపించండి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్
- అద్దరిపేట నుంచి పెరుమాళ్లపురం వరకూ బైక్ ర్యాలీ



వి.కొత్తూరులో ఓటు వేయడంపై డమ్మీ ఈవీఎంతో అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అద్దరిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దాడిశెట్టి శంకర్ మల్లిక్



బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

తొండంగి: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిన పేదల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా తనయుడు దాడిశెట్టి శంకర్‌మల్లిక్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో శనివారం పార్టీ నాయులతో కలిసి మండలంలోని అద్దరిపేట నుంచి పెరుమాళ్లపురం వరకూ 17 కిలోమీటర్ల మేర భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీకి అడుగడుగునా ప్రజలు, పార్టీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అర్హులందరికీ నవరత్నాలతో పాటు సంక్షేమ పథకాలను అందించి పేదల ఆర్థిక సుస్థిరతకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. తొలుత ఆంజనేయస్వామి, గ్రామ దేవతల ఆలయాల్లో వారు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యనమల పంపా ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, ఏలేరు రిజర్వాయర్ చైర్మన్ తోలాడ శైలా పార్వతి, పార్టీ నాయకుడు దడాల విజయ్ పాల్గొన్నారు.

హోరెత్తిన ఎన్నికల ప్రచారం

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజు కావడంతో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. సోమవారం జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. నమూనా ఈవీఎంతో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. వి.కొత్తూరులో జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వర రావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, తేటగుంటలో ఆత్మ చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, ఎస్.అన్నవరం, డి.పోలవరంలో వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, కొత్త సూరవరంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, హంసవరం, వల్లూరు, ఎస్.చామవరం, కేఓ.మల్లవరం, రాపాక, దొండవాక, ఎస్.సూరవరం తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు వైఎస్సార్ సీపీ తరఫున ప్రచారం నిర్వహించారు.

ప్రచార పర్వం.. పరిసమాప్తం

- ఆగిన మైకుల హోరు
- ప్రశాంతంగా మారిన పల్లెలు

తుని: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రంతో ప్రచారానికి చెక్ పడింది. సాయంత్రం 5 గంటల వరకూ పలు పార్టీల నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రచార రథాలు ఆయా పార్టీల కార్యాలయాలకు చేరుకున్నాయి. తుని నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణంలో ఎక్కడ చూసినా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు నోట్లు పంపిణీ చేస్తున్నారు. తునిలో టీడీపీ అభ్యర్థి యనమల దివ్య తరఫున ఓటుకు రూ.1500 చొప్పున అందజేస్తున్నారు. ఆదివారం పోలింగ్ ప్రక్రియకు సంబంధించి తుని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కేవీ రామలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె కోరారు. నియోజకవర్గం పరిధిలో ఓటర్లు 2,16,973 మంది ఉండగా పురుషులు 1,07,261 మంది, మహిళలు 1,09,684 మంది ఉన్నారు. ఇతరులు 28 మంది, సర్వీసు ఓటర్లు 166 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గం పరిధిలో 223 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసు అధికారులు తెలిపారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియడంతో గ్రామాలన్నీ ప్రశాంతంగా మారాయి. అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన నాటి నుంచి మైకుల ప్రచారంతో గ్రామాలన్నీ హోరెత్తాయి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారాన్ని నిలిపివేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి పోటీలో 15 మంది అభ్యర్థులు ఉండగా చివరిరోజు ప్రచారం జోరుగా నిర్వహించారు. ఎన్నికల్లో ప్రచార ఘట్టం ముగియడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకొనే పనిలో అభ్యర్థులు వారి అనుచరులు తనమునకలయ్యారు. ఏవిధంగా ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నిబంధనల ప్రకారం బూత్‌లెవల్ అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు.

పోలీసుల గట్టి నిఘా

పోలింగ్ సమయం సమీపిస్తుండడంతో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరంగా చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తు మరింత పెంచారు.



వి.కొత్తూరు డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో చేస్తున్న ఏర్పాట్లు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు
- నేడు సిబ్బందికి సామగ్రి పంపిణీ



ప్రత్తిపాడులో పోలింగ్ సామగ్రి పంపిణీకి సెక్టార్ల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్లు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల సామగ్రి పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతిపోలింగ్ బూత్‌కు ఒక పీఓ, ఒక ఏపీఓ, నలుగురు ఓపీఓల వంతున నియమించి, వారందరికీ శిక్షణ ఇచ్చామన్నారు. ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల ఆవరణలో డిస్పాచ్ కేంద్రం ఏర్పాటు చేశారు. సెక్టార్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. డిస్పాచ్ కేంద్రం నుంచి నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాలకు రవాణా కోసం వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు అసెంబ్లీ, కాకినాడ లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో బేలట్ పేపర్ల కమిషనింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారని తెలిపారు.

నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు

అసెంబ్లీకి 227 ఈవీఎంలు, లోక్‌సభకు 227 ఈవీఎంలు సిద్ధం చేశారు. వీటితో పాటు అదనంగా 90 బేలట్ యూనిట్లు, 90 కంట్రోల్ ప్యానెల్ యూనిట్లు, 136 వీవీ ప్యాట్‌లు రిజర్వులో ఉంచుతున్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన 75 గ్రామాల్లోని 1,07,189 మంది పురుషులు, 1,10,057 మంది మహిళలు, 21 మంది ఇతరులు వెరసి 2,17,267 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గాన్ని 23 సెక్టార్లు, 31 రూట్లుగా విభజించి, ఆ మేరకు పోలింగ్ సిబ్బందిని నియమించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్రీనివాసరావు తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో విస్తృతంగా ఏర్పాట్లు



దివ్యాంగుల సౌకర్యార్థం సిద్ధం చేసిన ట్రై సైకిళ్లు

తుని రూరల్: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పోల్చితే ఈసారి విస్తతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో 223 పోలింగ్ స్టేషన్లకు తుని మండలం వి.కొత్తూరు శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది తరలివెళ్లనున్నారు. ఇందుకుగాను డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడే పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని సరిచూసుకుని పోలింగ్ స్టేషన్లకు ఆదివారం సాయంత్రానికి చేరుకుంటారు. ఇందుకు 19 రూట్లకు 20 బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. తుని మండలంలో 71, తొండంగి మండలంలో 72, కోటనందూరు మండలంలో 41, తుని పట్టణంలో 39 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ పోలింగ్ స్టేషన్లలో 2.22 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంది. ఎండ, వాన నుంచి రక్షణకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో షామియానాలు, ఫ్యాన్లు, కూలర్లు, తమిళనాడు నుంచి తీసుకువచ్చిన బయో టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. రెండు వేల మందికి సరిపడే భోజనాలు సిద్ధం చేస్తున్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుతో పాటు దివ్యాంగుల సౌకర్యార్థం ట్రై సైకిళ్లు, ఓటర్లకు తాగునీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం రాకుండా ఇప్పటికే ట్రాన్స్‌కో అధికారులు చెట్లకొమ్మల తొలగింపు, ఇతరేతర సమస్యలను పరిష్కరించారు. కాగా సామగ్రి పంపిణీపై ఏఈఆర్వోలు, ఇతర సిబ్బందితో ఈఆర్వో కేవీ రామలక్ష్మి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పటిష్ఠ బందోబస్తుతో పాటు 30 శాతం రిజర్వ్‌డ్ సిబ్బందిని ఎన్నికల విధులు నిర్వహించేందుకు అందుబాటులో ఉంచారు.

14 గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు



శ్రీనివాసరావు, ఈఆర్వో, ప్రత్తిపాడు

నియోజకవర్గంలోని 14 గ్రామాల్లో 45 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్టు ఈఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. ఏలేశ్వరం మండలంలోని లింగంపర్తి, పెద్దనాపల్లి, తిరుమాలి, ప్రత్తిపాడు మండలంలోని చినశంకర్లపూడి, బురదకోట, ఏలూరు, ఒమ్మంగి, శంఖవరం మండలంలోని శంఖవరం, మండపం, కత్తిపూడి, రౌతులపూడి మండలంలోని పారుపాక, ఎస్.అగ్రహారం, ములగపూడి, ఎస్.పైడిపాల గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని 149 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేశారు. సిగ్నల్స్ లేని ఏరియాను (వెబ్ కాస్టింగ్‌కు వీలు లేని) షాడో జోన్ గ్రామాలుగా గుర్తించారు. రౌతులపూడి మండలం డి.జగన్నాథపురం, రాఘవపట్నం, జల్దాం, ప్రత్తిపాడు మండలం బురదకోట పోలింగ్ కేంద్రాల్లో వీడియో గ్రాఫర్లను, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఈఆర్వో వివరించారు.